కథా నిలయం
3737
శ్రీకాకుళం

# కొత్తవెలుగు

గుండెలమీద పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు జోగారావు.

కమలమ్మకి కూడా అలాగే, ఓ అగ్నిపర్వతం వచ్చి ఇంట్లో బ్రద్దలైనట్లు అనిపించింది.

ఇద్దరూ నిస్తేజులై నిర్జీవంగా అమట్టున ఉండిపోయారు నోట మాటలేక. ప్రాణంపోయిన వట్టికట్టెల్లా జీవంలేని కళ్ళతో అలా ఉండిపోయిన ఆ దంపతుల్ని చూసి, "మేం చెప్పింది మేం చెప్పాం. తర్వాత మీ ఇష్టం" అన్నట్లు నిర్లక్ష్యంగా ఓ చిరునవ్వు నవ్వి, పెదవి విరిచి, నొసలు చిట్లించి, రెండు భుజాలూ ఓమారు పైకి లాగి కిందకిజార్చి, సునీతకేసి చూశాడు మధు. వెంటనే సునీత కంగారుగా అతని చెయ్యి పట్టుకొని, సున్నితంగా తన వ్రేళ్ళతో అతని వ్రేళ్ళునొక్కి "నువ్వు కంగారుపడకు. మా అమ్మనీ నాన్ననీ నేను ఒప్పిస్తాను" అంటూ అతనికి మాత్రమే వినిపించేటట్టు నెమ్మదిగా చెప్పింది.

"ఒప్పుకోకపోతే?"

"ఒప్పుకొన్నా ఒప్పుకోకపోయినా నా నిర్ణయం మారదు."

"సరే, కానియ్యి" అంటూ చరచరా వెళ్ళిపోయాడు మధు. అతణ్ణి వీధి గుమ్మందాకా సాగనంపి, చిరునవ్వుతో వీడ్కోలు చెప్పి, హాల్లోకి తిరిగివస్తూనే, నిప్పులు కక్కుతూ తల్లిదండ్రులకేసి చూసింది సునీత.

ఆ షాక్ నుంచి ఇంకా తేరుకోలేదేమో, చిత్తరువుల్లో బొమ్మల్లా వాళ్ళిద్దరూ చేష్టలు దక్కి, అలాగే కుర్చీల్లో కూలబడి ఉన్నారు.

పెద్దగా కంఠం హెచ్చించి రెచ్చిపోతూ, "అతనికేం సమాధానం చెప్ప కుండా ప్రాణాలు పోయినట్లు అలా కూర్చుండిపోయారేం....? మిమ్మల్నే!" అంటూ అరిచింది సునీత.

ఆమె కేకలకి ఉలిక్కిపడి మొదట కమలమ్మ ఈ లోకంలోకి వచ్చింది. చైతన్యమైతే వచ్చింది కాని, ఆమెకి ఇంకా నోట మాటరాలేదు.

దయ్యం పట్టినదానిలా తనకేసి గుడ్లప్పగించి చూస్తూన్న తల్లిని చూస్తే అసహ్యం వేసింది సునీతకి.

"నీ చూపు నాకర్థం అయింది. మీరిద్దరూ శిలాప్రతిమల్లా ఇలా ఎందుకుండిపోయారో నాకు తెలియదనుకోకండి. మీకిష్టంలేదు.... మధుని నేను పెళ్ళి చేసుకోవడం.. ''

"నోర్మయ్! మళ్ళీ ఆ మధు మాట ఎత్తావంటే పళ్ళు రాలగొడతాను!" సింహంలా గర్జించింది కమలమ్మ.

"ఏం?.... ఎందుకని?.... ఏం తక్కువ అతనికి? అందం హోదా, డబ్బు ఏంలేదు?.... ఏంలేదు అతనికి? ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. ఒకర్నొకరు అర్థం చేసుకున్నాం. ఒకర్నొకరు ప్రేమించుకున్నాం...."

"ఏడవలేకపోయారు!"

ఖంగ్‌మన్న జోగారావు కంఠం విని ఉలిక్కిపడింది సునీత.

కాస్సేపాగి స్థిమితపడి, "నాకంటే అతను పదేళ్లు పెద్ద అనేనా మీ అభ్యంతరం?" తండ్రి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ ప్రశ్నించింది సునీత.

"ఓసి దౌర్భాగ్యురాలా....!" కోపంతో ఊగిపోతున్న జోగారావు ఆపైన వాక్యం పూర్తిచేయలేక, రెండు గుప్పిళ్ళూ బిగించాడు.

అతను పూర్తి చెయ్యకుండా వదిలేసిన వాక్యాన్ని కమలమ్మ పూర్తి చేసింది, "నీకేం కర్మకాలిందే. పెళ్ళి అయినవాడిని, అందులో పెళ్ళాం బిడ్డలున్నవాడిని పెళ్ళి చేసుకోడానికి?" అంటూ.

"ఓ! అదా? నా కిష్టమైంది. నేను చేసుకుంటున్నాను నాకు లేని అభ్యంతరం మీకెందుకు?" నిర్లక్ష్యంగా ముఖంపెట్టి, విలాసంగా అటూ ఇటూ ఊగుతూ మరీ అంది సునీత.

"నీకు పిచ్చిగాని ఎక్కిందేవిటే!" అంటూ కమలమ్మ మీదమీదికి వచ్చిందే కాని, చూసి చూసి ఇరవై యేళ్లు నెత్తిమీదికి వచ్చిన ఆడపిల్లమీద చెయ్యి చేసుకోడానికి ఇష్టంలేక, ఎత్తిన చేతినే దింపేసింది.

తల్లి చేతికేసి నిర్లక్ష్యంగా చూసి, "పిచ్చెక్కిందో- వెర్రే ఎక్కిందో- మధుని చేసుకుంటున్నాను - అంతే!" అంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది సునీత.

కమలమ్మ నిస్సహాయంగా భర్తకేసి చూసింది.

"“ఇదంతా ఖర్మే! మన ఖర్మ!"' అంటూ నెత్తిమీద చేతులు పెట్టుకుని నీరసంగా కూలబడ్డాడు జోగారావు.

ఇద్దరిమధ్యా నిశ్శబ్దం.

శ్మశానంలో ఉండే భీతావహమైన భయంకర నిశ్శబ్దం.

''అడిగిందల్లా కొనిపెడుతూ అల్లారుముద్దుగా పెంచాం'' — కమలమ్మ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

''అందుకే అడింది ఆటగా తయారయి ఇప్పుడీస్థితికి వచ్చింది'' — పైటతో కళ్ళు వత్తుకొంది కమలమ్మ.

మోకాళ్ళ మధ్య తల పెట్టుకుని కూర్చున్న జోగారావు గుండె భగ్గున మండిపోతోంది.

"చిన్నప్పుడే పెళ్ళి చేసేస్తే దీని బుద్ధి ఇలా పెడదారిని పట్టకుండా ఉండును.''

''బుద్ధి వయస్సునిబట్టి ఉంటుందా? ఎంత అమాయకురాలివి!'' అన్నట్లు నిర్జీవంగా నవ్వాడు జోగారావు.

''ఈ చదువులు వద్దండీ అంటే విన్నారుకాదు. డిగ్రీలు తెచ్చుకుని మా అమ్మాయి పెద్ద ఆఫీసరు కావాలి అన్నారు. ఇప్పుడు చూడండి ఎలా పెడతిరిగిందో అది!"

జోగారావు ఛర్రున లేచాడు.

''చదువేం చేసిందే, దాని బుద్ధి అలా ఏడిసింది కాని? ఎంతమంది అమ్మాయిలు చక్కగా చదువులు చదువుకొని సమస్యలు పరిష్కరించుకోవడం లేదూ? పరిష్కరించుకోవడం అట్టేపోయి, ఇది కావాలని వెళ్ళి గంగలో దూకుతోంది!''

''ఇదేం ఖర్మండీ! ఒక్కగానొక్క కూతురికి మనం పెళ్ళి చెయ్యలేమా ఏమన్నానా? ఒకవేళ మనం చేసే పెళ్ళి ఇష్టం లేకపోతే, శుభమైన కుర్రవాణ్ణి ఎవర్నో తను ఎన్నుకొని ప్రేమించి పెళ్ళి చేసుకోవచ్చు గదండీ? మనం ఏమైనా కాదంటామా? లోకంలో పెళ్ళికొడుకులే కరువైనట్లు, పెళ్ళాం బిడ్డలున్నవాడితో ఈ రెండో పెళ్ళి ఏమిటండీ!?"

రెండు చేతులతో తల బాదుకోసాగింది కమలమ్మ.

"ఏవిచేమిటి? అదే ఖర్మంటే! అదృష్టం అందలం ఎక్కిస్తానంటే బుద్ధి బురదలోకి ఈడ్చుడం అంటారు దీన్నే."

"ఇదెక్కడి ఘోరకలి అండీ? మనం ఇలా చూస్తూ ఊరుకోవడమేనా?"

"ఊరుకోక?"

"అయ్యోరామా! వాడు దీన్నేదో మాయలో పడేశాడండీ—ఇది కనుక్కోలేకపోతోంది. నాలుగురోజులు పోయాక మోజుతీరి దీన్ని వదిలేస్తాడండీ, ఆ అప్రాచ్యుడు. అనక బ్రతుకు బండలై ఇది ఏడుస్తూంటే, గుండె పగిలి చావడం కంటే మనకి వేరేదారి ఏముంటుంది?"

ఒక్కమాటు ఉన్నట్టుండి బావురుమంది కమలమ్మ.

జోగారావు అదిరిపడి దగ్గరగా వచ్చి తల నిమురుతూ "ఊరుకో - నాకు లేదంటావా బాధ? మగవాడిని కనక 'ఎంత ఖర్మ పట్టిందిరా దేవుడా' అంటూ లోపల్లోపల కుమిలి కుమిలి ఏడుస్తున్నాను" అన్నాడు.

ఈ మాటలంటున్నప్పుడు జోగారావు కంఠం జీరబోయింది. ఎంత ఎలాంటి కష్టం వచ్చినా, చలించకుండా కొండలా గంభీరంగా ఉండే భర్త గొంతులో దైన్యం చూసి కళవళపడింది కమలమ్మ.

ఒకళ్ళనొకళ్ళు చూస్తూ కన్నీళ్ళు కారుస్తూ ఉండిపోయారు. కాస్సేపయ్యాక ఉస్సురని లేస్తూ "సరే కానియ్యి, భగవంతుడు ఇలా రాశాడు మన మొహాన్ని" అంటూ నుదుటను పట్టిన చెమట తుడుచుకొనే వంకతో, పైమీద కండువా తీసి కళ్ళు తుడుచుకున్నాడు జోగారావు. ఇంకోమారు చెప్పి చూస్తే వినకపోతుందా అనే ఆశతో లోపలికి వెళ్ళింది కమలమ్మ.

ఆ తర్వాత రెండు మూడు రోజులు రకరకాలుగా చెప్పి చూశారు కమలమ్మా జోగారావూ.

నెత్తినోరూ బాదుకొన్నారు.

"మా తల్లివి కదూ—చెప్పేది అర్థం చేసుకో!" అని బ్రతిమాలారు.

"ఇది తప్పు, ఆ అమ్మాయి ఉసురు నీకు తగులుతుంది" అని బెదిరించారు.

"చదువుకున్న దానివి. సాటి ఆడదానికి అన్యాయం చెయ్యకు'' అని హితవు చెప్పారు.

''మైనారిటీ తీరింది కదా - ఇంక నాకు ఏంలేదని అనుకుంటున్నావేమో, మతి భ్రమించిందని నిన్ను పిచ్చాసుపత్రిలో పడేస్తాం జాగ్రత్త!'' అని భయ పెట్టారు.

''నీ మొండి పట్టు మానకపోతే ఇంతటితో నీకూ మాకూ తెగతెంపులు. నువ్వు మా కూతురివీ కాదు, మేం నీకు తల్లిదండ్రులమూ కాదు'' అని స్పష్టం చేశారు.

ఆఖరికి ''మాకింత విషం పెట్టి మరీ వెళ్ళవే!'' అంటూ ఏడ్చారు.

సునీత ఏం వినిపించుకోలేదు.

తన నిర్ణయం మార్చుకొనే ప్రసక్తి లేదంది.

మీకిష్టం లేకపోతే ఇల్లువిడిచి వెళ్ళిపోతానంది.

బ్రీఫ్ కేస్ తీసుకుని బయలుదేరుతూన్న కూతుర్ని చూసి జోగారావు ఉగ్రుడైపోయాడు.

ఇంటి సీలింగ్ దద్దరిల్లేలాగ ''ఆగు" అంటూ అరచాడు.

సునీత వెనక్కి తిరిగి చూసింది.

"గడపదాటి అడుగుబయట పెట్టావో - ఇంక అదే ఆఖరు. మళ్ళీ నువ్వీ ఇంటికి రానక్కర్లేదు. ఆలోచించుకొని మరీ కాలు బయటపెట్టు.''

పిడుగులు వర్షిస్తున్నట్లుంది అతని కంఠం.

సునీత నిర్లక్ష్యంగా అతనికేసి చూసింది.

అడుగు ముందు కేసింది.

వెనక్కి తిరిగి చూడకుండా విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

కమలమ్మ నరికేసిన చెట్టులా నడి వాకిట్లో కూలబడిపోయింది. రెండు అరచేతులతోనూ నేలమీద బాదుతూ ఏడవసాగింది.

జోగారావు సునీత వెళ్ళిన దిక్కే చూస్తూ స్థాణువులా రెండు నిముషాలు అమట్టున నిలబడిపోయాడు. ఆ తర్వాత వెనక్కి భార్యవైపు తిరిగాడు.

"ఎవరికోసం ఏడుస్తున్నావు? ఆ దౌర్భాగ్యురాలు అసలు మనకి పుట్ట లేదు. పుట్టినా ఈ క్షణం నుంచి చచ్చిపోయింది. దాన్ని గురించి ఇంక ఈ ఇంటిలో ఎవరూ ఏడవడానికి వీలులేదు."

జోగారావు సింహంలా అరిచా ననుకున్నాడు. కాని, ఆ అరుపు సింహ గర్జనలా లేదు. గొర్రె అరిచినట్లుంది.

కమలమ్మ పైట నోట్లో కుక్కుకుని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఆ రోజు సరే. మర్నాడు కూడా 'భోజనానికి లేవండి' అని కమలమ్మ పిలవనూ లేదు, 'నాకు అన్నం పెట్టు' అని జోగారావు అడగనూ లేదు. రెండు రోజుల దాకా ఇద్దరూ చెరో మంచం మీదా కన్ను మూతపడకుండా అలా చూస్తూ పడుకొని ఉన్నారు. ఆ రెండు రోజుల్లోనూ, మొహాలు పీక్కుపోయి, పదేసి లంఖణాలు చేసినట్లు అయిపోయారు కమలమ్మా జోగారావూ.

మూడోనాడు అన్నం సగం కలుపుకొని ఇంకా ముద్ద నోట్లో పెట్టుకో కుండానే కంచంలో చెయ్యి కడిగేసుకున్నాడు జోగారావు. తను పరధ్యానంలో టేబిల్ మీద వడ్డించిన మూడో కంచం చూసి, నోటిదాకా ఎత్తుకొన్న ముద్దని వదిలేసి వెక్కి వెక్కి ఏడుస్తూ అన్నం దగ్గర్నుంచి లేచి వెళ్ళిపోయింది కమలమ్మ.

రోజులు గడుస్తున్నాయి.

జోగారావూ కమలమ్మా ఒకర్నొకరు పలకరించుకోడానికి భయపడు తున్నారు.

పలకరిస్తే ఎక్కడ గుండె పగిలి ఏడుపు వస్తుందో!

ఇంట్లో భయంకరమైన నిశ్శబ్దం.

బీతావహమైన ఒంటరితనం.

జీవ చైతన్యం లేని వాతావరణం.

ఓ కాలు మడిచి మరో కాలు జాపి, మడిచిన మోకాలి మీద మోచెయ్యి ఆన్చి, దూరంగా చెట్టుమీద ఎండుపుల్లల్ని గూడు కట్టుకోడం కోసం ముక్కుతో విరుస్తూన్న కాకిని చూస్తూ పరధ్యానంగా కూర్చున్నాడు జోగారావు

ఎవరో పాతికేళ్ళ అమ్మాయి పూర్తిగా ఏడాది నిండని ఓ పసిపాపని ఎత్తుకొని చీడీలు ఎక్కుస్తూంది. కళ్ళూ మొహం పీక్కుపోయి, జుట్టు చిందర

పందరగా ఉన్నా ముఖం కళగా ఉంది. ఉతికి ఆరేసిన నేత చీరా, చేతికి మట్టి గాజులూ, చెవుల్ని దుద్దులూ, మెళ్ళో మంగళసూత్రాలూ తప్ప మరేం అలంకారాలూ లేవు ఐశ్వర్యాలన్నీ పోయి ఐదోతనం మాత్రమే మిగిలిన పేద ముత్తైదువులా ఉంది ఆమె.

ఎవరు చెప్మా ఈమె?

జోగారావు సర్దుకుని కూర్చుని ఆమెకేసి పరకాయించి చూశాడు. ఆమె మాత్రం అతణ్ణి కళ్ళతో కాల్చేస్తున్నట్లు చూస్తోంది.

ఆ చూపులకి తట్టుకోలేక కళవళపడి "ఎవరమ్మా నువ్వు? ఎవరు కావాలి?" అనడిగాడు జోగారావు.

ఆమె సమాధానం చెప్పలేదు. ఆ చూపుల్లో బాధ, దుఃఖం, ఆగ్రహం జోగారావుని తినేసేలా ఉన్నాయి. ఆమె చంకలో ఉన్న పాప మాత్రం, జోగారావు తెల్లని బుంగమీసాలు చూసి కేరింతలు కొడుతోంది.

"ఎవరికోసం?" ఇబ్బందిగా అడిగాడు జోగారావు.

ఆమె అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది.

"ఎవరమ్మా నువ్వు?"

"తెలియదా మీకు?" ఒక్కసారిగా ఆమె కంఠంలో దుఃఖ సముద్రం పొంగింది.

"నాకా....? నువ్వా....?"

తీక్షణంగా అతనికేసి చూసి, "అయితే వినండి.... మీ అమ్మాయి లేదూ - సునీత? ఆమె ధర్మమా అని సర్వం పోగొట్టుకొన్న దౌర్భాగ్యురాల్ని" ఈ మాట లంటున్నప్పుడు ఆమె కంఠం బొంగురుపోయింది.

జోగారావు మాత్రం ఆ మాటలకి ఉలిక్కిపడ్డాడు. లేచి నిల్చుంటూ "నువ్వు - నువ్వు - ఆ మధు భార్యవా?" అని అడిగాడు.

అందుకు సమాధానంగా ఆమె ఒక్కమారుగా బావురుమని ఏడ్చేసింది.

జోగారావు కళవళపడి, దగ్గరగా వెయ్యబోయిన అడుగుని వెనక్కి వేసి, "ఏడవకమ్మా ఏడవకు" అంటూ అనునయించబోయాడు.

"ఏడుపుకాక నాకేం మిగిలిందండీ? సుఖంగా సాగుతూన్న నా సంసారంలో చిచ్చుపెట్టింది అయన్ని నాకు కాకుండా చేసింది. ఆ ఇంట్లో ఇంతవరకూ నాది

అనుకున్నదల్లా తనది చేసుకుంది ... నేనిప్పుడేమైపోవాలి? నాకేవిటి దారి చెప్పండి?"

జోగారావు స్థాణువులా ఉండిపోయాడు.

"మీరలా సమాధానం చెప్పకుండా ఊరుకుంటే కాదు. మీ అమ్మాయిని ఇలా తోటి ఆడవాళ్ళ కొంపలు తియ్యడానికే పెంచి పెద్దచేసి తర్ఫీదు ఇచ్చి పంపారా?"

నిప్పుల్లా వచ్చి తగుల్తున్నాయి ఆమె మాటలు.

"ఆడపిల్లని కన్న తండ్రి మీరు! నా పరిస్థితిలోనే మీ అమ్మాయి ఉంటే ఏం చేసేవారు? తల్లీ తండ్రీ అన్నదమ్ములూ ఎవరూలేని దిక్కులేని దాన్ననేగా ఈ అన్యాయం?"

నిలువు గుడ్లేసుకుని చూస్తున్నాడు జోగారావు.

"ఈ లోకంలో న్యాయంలేదని నాకు తెలుసు. అందులో సునీతలాంటి స్త్రీని కన్న తండ్రి మీరు - నా న్యాయం సంగతి మీరెందుకు ఆలోచిస్తారు? ఏదో నా బాధ కొద్దీ నేను వచ్చాను.''

ఈ మాటలంటూ ఆమె మళ్ళీ ఏడ్చేసింది.

జోగారావు అతి ప్రయత్నం మీద గొంతు స్వాధీనంలోకి తెచ్చుకుని "ఊరుకో అమ్మా.... ఊరుకో'' అన్నాడు.

కాని, ఆమె దుఃఖం కట్టలు త్రెంచుకు వస్తోంది "నీ గుండెల్లో ఎంత చిచ్చు రగిలించిందో కూడా నేను అర్థం చేసుకోగలను'' అన్నాడు జోగారావు బాధగా.

ఆమె నిర్ఘాంతపోయి చూసింది.

కళ్ళు తుడుచుకొని అతనికేసి ఆశ్చర్యంగా మరీ చూసింది.

"అది చేసిన పనిని నేను హర్షిస్తున్నాననుకోకమ్మా! వాళ్ళమ్మా నేనూ దానికి శతవిధాల చెప్పి చూశాం. బతిమాలాం. బెదిరించాం. ఈ పాపం ఆపాలని చూశాం.... కాని.... కాని...."

"నిజంగా?" అన్నట్లు చూసింది ఆమె.

"నా మాట నమ్ము తల్లీ!.... అయినా, ఆ దౌర్భాగ్యురాలు మా మాట వినలేదు. చివరకి అది మాకు పుట్టనేలేదు, పుట్టినా చచ్చిపోయిందని ఒక ఏడుపు ఏడిచి ఊరుకున్నాం.... మేం ఈ విషయంలో నిస్సహాయులం. అయినా ఈ

పాపంలో మాకు భాగం లేకపోలేదు- దాని తల్లి దండ్రులుగా ఇంకా బ్రతికి ఉన్నందుకు....''

ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

అయితే, ఈ కన్నీళ్ళు దుఃఖంవల్ల వచ్చినవి కావు.

పశ్చాత్తాపంవల్ల ఉబికిన కన్నీళ్లు....

"బాబుగారూ, క్షమించండి.... నాకు తెలియక బాధలో మిమ్మల్ని...."

"ఏం ఫరవాలేదులే ... మరి.... నువ్వు....?"

"ఎలా బతుకుతావు అనేనా మీరు అడగబోతున్నది?"

"అదికాదమ్మా!.... కోర్టులో దావా వేస్తే - భార్య బ్రతికుండగా మరో భార్యని చేసుకున్నందుకు అతణ్ణి శిక్షిస్తారు.... కనీసం నీకు భరణం అయినా ఇప్పిస్తారు...."

"భర్తే నాకు లేకుండా పోయాక ఆయనిచ్చే భరణం ఎందుకండీ? కోర్టులకి వెళ్ళడం, కక్ష సాధించడం, దేవుళ్ళాడ్డం - ఇదంతా దేనికండీ?"

"పౌరుషం ఉన్న స్త్రీలకి అంతే అనుకో! అయినా బ్రతకాలిక దా?"

"ఇంతయ్యాక ఇంకా బ్రతకడమా? హుఁ! దిక్కులేనిదాన్ని.... చదువు రానిదాన్ని.... బ్రతకడం చేతగానిదాన్ని... "

"అది కాదమ్మా!...."

"బాబుగారూ!.... బ్రతకడం కష్టం కానీ.... చావడం...." అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ ఆమె వెనక్కి తిరిగింది.

ఆమె తలవంచుకొని ఏడుస్తూ వెళ్ళిపోతోంది.

ఆమె వళ్ళో ఉన్న పాప మాత్రం వెనక్కి తలతిప్పి జోగారావుకేసి చూస్తూ నవ్వుతోంది.

ఒక్క క్షణం ఆలోచించి "ఆగమ్మా ఆగు!" అన్నాడు జోగారావు.

మెట్లు దిగుతున్నదల్లా ఆగింది.

"కమలా!" అంటూ లోపలికి ఒక కేక పెట్టేడు జోగారావు.

కమలమ్మ వచ్చింది....

"ఈ అమ్మాయి మధు భార్య! అదే - సునీత పెళ్ళి చేసుకొన్న మధు లేడూ?"

కమలమ్మ ముఖం వివర్ణమైంది.

"పాపం, ఈ అమ్మాయికి నా అన్న వాళ్ళెవరూ లేరు."

కమలమ్మ కళ్ళల్లో జాలి!

"అయ్యో! అలాగా?" అంది.

"మనకీలేరుగా?" - జోగారావు బాధని అణచుకుంటూ గంభీరంగా అన్నాడు.

కమలమ్మ అదిరిపడింది.

"కూతుర్ని పోగొట్టుకొన్న మనకి ఒక కూతుర్ని ఇచ్చాడు భగవంతుడు!"

కమలమ్మ విస్తుపోయింది.

"అవును కమలా....! అలా తెల్లబోతావేమిటి? అమ్మాయిని లోపలికి తీసికెళ్ళు... రా తల్లీ! ... ఇంక ఇప్పటినుంచి నీకు అమ్మా నాన్నా లేరను కోకు...." అంటూ జోగారావు ఆమె చేతిలో ఉన్న పాపని అందుకున్నాడు.

కాస్సేపు తటపటాయించి, ఆ తర్వాత పెద్ద మనసు చేసుకుని, "రా.... అమ్మా!.... రా...." అంది కమలమ్మ.

తన చుట్టూ అప్యాయంగా చేతులు చుట్టి లోపలికి తీసుకుని వెళుతూన్న కమలమ్మ భుజం మీద వాలి "అమ్మా! ..." అంటూ ఏడ్చేసింది ఆమె.

కమలమ్మ ఆమె కళ్ళు తుడుస్తూ "ఏడవకు తల్లీ! సాటి స్త్రీగా నీ బాధ నాకు తెలుసు. ఆ బాధ తీసెయ్యలేను గాని...."

"చాలమ్మా.... ఈ మాత్రం ఆత్మీయత ఉంటే...."

ఇద్దరి కళ్ళల్లోంచి జలజలా నీళ్ళురాలాయి.

జోగారావు సంతృప్తిగా కళ్ళు వత్తుకుని, అంతవరకూ చీకటిగా ఉన్న ఇంట్లోకి, కొత్త వెలుగులాంటి పాపని ఎత్తుకొని, అడుగుపెట్టాడు. ఇప్పుడు కమలమ్మకి జోగారావుకి కూతురు లేదనే బెంగలేదు. కొత్త కూతురుతోపాటు మరో కొత్త కాంతి కూడా వచ్చింది. ఏడాది వయస్సున్న ఆ కాంతే ఇప్పుడు వాళ్ళ కళ్ళ వెలుగు! *

(వనిత - '88 దీపావళి సంచిక)